క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నర్వ: శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శివలింగాలకు, ఆంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, అఖండ మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు ప్రసాద వితరణ చేశారు. సోమవారం ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి.

తహసీల్దార్‌గా సతీష్‌కుమార్



ఊట్కూర్: మండల తహసీల్దార్‌గా సతీష్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో హన్వాడ మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. గత కొంతకాలంగా డిప్యూటీ తహసీల్దార్ తిరుపతయ్య ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్లలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు నిర్మాణ కమిటీ సభ్యులు విరాళాలు సేకరిస్తున్నారు. పట్టణంలోని రామాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పిల్లికళ్ల వెంకటరాములు, జయశ్రీ దంపతుల చేతులమీదుగా వారి కుమారుడు రూ.25వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

నారాయణపేట రూరల్: ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ట్రస్మా) మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీ.నర్సింహారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని వక్తలు కొనియాడారు. సోమవారం పట్టణంలోని శ్రీ సాయి స్కూల్‌లో ఏర్పాటుచేసిన జయంతిలో పలువురు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యా, వైద్యరంగంలో తనవంతు సహకారం అందించి పాఠశాల, ఆస్పత్రిని నెలకొల్పారని, కాంగ్రెస్ పార్టీలో మంచి నాయకుడిగా ఎదిగి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పట్టణ ప్రజలకు, మార్కెట్ చైర్మన్‌గా రైతులకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో లలిత, సాయిలీల, నర్సింహ, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి ఎంపికైన అంజలికి సన్మానం



నారాయణపేట రూరల్: జిల్లా నుంచి ఆర్మీకి ఎంపికైన తొలిమహిళ అంజలికి సోమవారం పలువురు సన్మానం చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో పలువురు ఆమె ఇంటికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్నేహితులు, బంధువులు ఆమెకు శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. అదేవిధంగా తాను విద్యాబోధన చేసిన పీహెచ్‌ఈఎస్ పాఠశాల, శ్రీసాయి జూనియర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వయో వృద్ధుల అనుభవాలు సమాజానికి అవసరం

నారాయణపేట: వయో వృద్ధుల అనుభవాలు సమాజానికి అవసరమని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని లైయన్స్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు వృద్ధులకు చాలా గౌరవం ఇచ్చేవారిమని, కాలక్రమేనా విదేశీ సంస్కృతికి అలవాటు పడి సొంత తల్లిదండ్రులను పట్టించుకోవడం మరిచారన్నారు. ఎల్లవేళలా వారిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వృద్ధులకు పోషణ అనేది చాలా ముఖ్యమని, సమయానికి భోజన సదుపాయాలు ఉంటే చాలన్నారు. 65 ఏళ్ల పైబడిన వాళ్లకు కొడుకుల నుంచి నిరాదరణ ఎదురైతే.. వాళ్లకు వెల్ఫేర్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్టు ఆర్డీఓ పరిధిలో ఉంటుందన్నారు. ఏఈపీపీ సురేశ్‌కుమార్, న్యాయవాదులు నందు నామాజీ, దత్తు, వెంకటయ్య పాల్గొన్నారు.



మరికల్‌లో నాగుల విగ్రహాలకు పాలుపోస్తున్న భక్తులు



బాపూనగర్‌లో పాలుపోస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే చెన్‌బస్సప్ప

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగులపంచమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, దంపతులు తలంటు స్నానాలు ఆచరించి దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అక్కడ నాగదేవతలకు పూజలు చేశారు. పుట్టల్లో పాలుపోసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న అసెంబ్లీ ప్రవాస్‌యోజనలో పాల్గొనడానికి పేటకు వచ్చిన కర్ణాటక రాష్ట్ర శివమొగ్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ చెన్‌బసప్ప సోమవారం స్థానిక బాపూనగర్‌లోని నాగప్రతిమలకు పాలుపోశారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, లక్ష్మి శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మాగనూర్: నాగుల పంచమని మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌చౌరస్తాలో ఎంపీపీ శ్యామలమ్మ పాలుపోసి నాగుల విగ్రహాలకు పూజలు చేశారు. పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు పండుగ సంబురాలు చేసుకున్నారు.

మరికల్: మండలంలోని వివిధగ్రామాల్లో భక్తులు ఘనంగా నాగుల పంచమిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శివాలయంలో నాగుల విగ్రహాలకు కొత్త దంపతులతోపాటు భక్తులు పాలు పోశారు. అనంతరం శివలింగానికి పూజలు చేశారు.

ధన్వాడ: మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు గురువారం నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాగులకు పూజలుచేసి పాలు, నైవిద్యం సమర్పించారు. అనంతరం శ్రావణ సోమవారం ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కృష్ణాలో నాగదేవత విగ్రహాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని కున్సిలో సోమవారం నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు పుట్టల వద్దకువెళ్లి పాలుపోసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శరణగౌడ, నల్లె నర్సప్ప, సర్పంచ్ అంజప్పగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, వెంకట్‌రెడ్డి, శరణప్ప, పిట్టల్ ప్రభు, రాంచందర్ మాస్టర్, మాణిక్యప్ప పాల్గొన్నారు.

నర్వ: నాగుల పంచమిని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రావణ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మహిళలు నాగదేవతల విగ్రహాలకు పాలుపోసి, నైవేద్యాలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగులపంచమిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయం, క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, అర్చకులు శివకుమార్‌స్వామి, బస్వంత్‌రాజ్, శరణప్ప, మహిళలు పాల్గొన్నారు.



నర్వలో..



ధన్వాడలో..

కలెక్టర్‌ను కలిసిన కోటకొండ వాసులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండకు చెందిన అఖిలపక్షం నాయకులు సోమవారం కలెక్టర్ శ్రీహర్షను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యంకోసం కొత్తజిల్లాలు, మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించిందన్నారు. 104రోజులుగా ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి తెలపడం కోసం నిరసన దీక్షలు చేస్తున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ ప్రాంత ప్రజల కోరికను మండలఏర్పాటు అవశ్యకతను తెలియజేయాలని విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా అప్పక్‌పల్లినుంచి కోయిలకొండ వరకు మంజూరైన డబల్‌రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని, బాధితులకు డబల్‌బెడ్రూం కేటాయింపులో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాస్, బి.రాము, కాశీనాథ్, యాదగిరి, రాజు, చెన్నప్ప పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మరికల్: మండల కేంద్రానికి చెందిన మరికల్ కొండేటి చిన్న బుడ్డప్పకు చెందిన ఎద్దు ఆదివారం అర్ధరాత్రి మేతకోసం తాడుతెంపుకొని మేతమేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందిన ఎద్దు విషయాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. రూ. 60వేలు విలువచేసే ఎద్దుమృతి చెందడంతో ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితరైతు విద్యుత్‌శాఖ అధికారులను కోరుతున్నాడు.

టీఎంఈసీ ఫోరం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట: తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎండీ అజీమ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.శంకర్, జనరల్ సెక్రటరీగా మహ్మద్‌యూసుఫ్, ట్రెజరరీగా డి.తిరుమలేశ్, ఉపాధ్యక్షుడిగా గులాం ఖాదర్‌ఖాన్, మల్లికార్జున్, శ్రీదేవి, లక్ష్మి నర్సింహ, జాయింట్ సెక్రటరీగీ శ్రీనాథ్, సందీప్, షేక్ అర్జాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజునాయక్, దేవరాజ్, తిమ్మప్ప, పబ్లిసిటీ సెక్రటరీగా శ్రీనివాస్‌జీ, డి.చెన్నకేశవులు, సభ్యుడిగా కమ్లానాయక్‌ను ఎన్నుకున్నారు. నూతనకార్యవర్గం సభ్యులను మున్సిపల్ ఎంప్లాయీస్ సిబ్బంది పూలమాలతో సన్మానించారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేటరూరల్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, నరహరి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి పట్టణ ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ముట్టడికి కదిలారు. ఈ సందర్భంగా డీసీసీబీ బ్యాంకు చౌరస్తాలో పోలీసులు వారిని అడ్డుకోగా పక్కనే ఉన్న వివేకానంద మున్సిపల్ పార్క్ ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, విద్యాసంస్థల్లో ఖాళీపోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు చేస్తున్న కార్యక్రమానికి విద్యార్థులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, మహేందర్, కాశీ, రవికిరణ్, సనాబేగం, శ్యామల, ప్రవీణ్, పవన్, విష్ణు, వెంకటేష్, నరేష్, రాము, నవీన, నిషా, అక్షయ్, సాకేత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు..

సెకండ్ ఏఎన్ఎంల వినూత్న నిరసన



బోనాలెత్తి నిరసన వ్యక్తంచేస్తున్న ఏఎన్ఎంలు

నారాయణపేట: సెకండ్ ఏఎన్ఎంలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బోనాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కరోనా సమయంలో ఏఎన్ఎంలను దేవుళ్లతో సమానాంగా పోల్చారని ఇప్పుడు వారిని పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. సెకండ్ ఏఎన్ఎంలను ఎటువంటి పరీక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసేంతవరవకు సమ్మెను విరమించే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సబిత, వెంకటేశ్వరమ్మ, భారతి, శోభ, చంద్రకళ, లక్ష్మి, రామేశ్వరి, అనురాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

నారాయణపేట: పేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.రాజేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో సోమవారం స్థానిక సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ మేరకు ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, బీఆర్ఎస్ పట్టణ విజయ్‌సాగర్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎస్ఆర్‌రెడ్డి పేరును అధిష్టానం తొలి జాబితాలోనే ప్రకటించ డంతో ముడోసారి నియోజకవర్గంలో కారు మరోసారి గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: బీఆర్ఎస్ తరుపున పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంపై సంతోషం వ్యక్తంచేస్తూ సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లను పంచి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుధీర్‌కుమార్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, మల్లప్ప, మురళీధర్‌రెడ్డి, పటేల్ నర్సింహులు, గౌని శ్రీనివాసులు, సత్యానారాయణగౌడ్, శివాజీ, వెంకటేష్, నారాయణస్వామి, రాంచంద్రయ్య, రాము, సూరి తదితరులు పాల్గొన్నారు.



పేటలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మరికల్: నియోజకవర్గ బీఆర్ఎస్‌నుంచి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో సోమవారం మండల పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ సురేఖ మాట్లాడుతూ.. మూడోసారి రాజేందర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, శేఖర్, బసంత్, రాజేష్, రామస్వామి, రవి, ఉస్సెన్, పుల్లయ్యగౌడ్, మతిన్, శ్రీను, జగదీశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నర్వ: మక్తల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి మళ్లీ చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండ్ల చిన్నయ్య, గడ్డం నర్సింహులు, పల్లె శేఖర్, వెంకటయ్య, రాజారెడ్డి, అశోక్, కృష్ణ, బొజ్జన్న, రాము, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ధన్వాడలో స్వీట్లను తినిపించుకుంటున్న పార్టీ కార్యకర్తలు

మద్దూరు: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి కేసీఆర్ టికెట్ కేటాయించడంతో నాయకులు మండల కేంద్రంలో సోమవారం బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రాములుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: బీఆర్ఎస్ తరుపున పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లను పంచి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, జెడ్పీటీసీ లావణ్య, వైస్‌ఎంపీపీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నర్వ: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన 33మంది ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా వారికి గులాబీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు దండు అయ్యప్ప, డా.శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటయ్య, రాంపూర్ నర్సింహులుగౌడ్, పాండు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

యువకుడికి అభినందన..

మాగనూర్: మండలంలోని వర్కూర్‌కు చెందిన కొత్తకుర్వ నవీన్ అనే యువకుడు సెంట్రల్ కానిస్టేబుల్‌గా ఎన్నికై య్యారు. దీంతో సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి యువకుడిని తన నివాసానికి పిలుపించుకొని శాలువాతో సన్మానించారు. దేశ రాజధానిలో ఈ యువకుడు ఎన్నికవడం చాలా గర్వంగా ఉందన్నారు. యువత ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, సర్పంచ్‌లు నిర్మలమ్మ, అశోక్‌గౌడ్, మంజుల, నాయకులు రాఘవేంద్ర, మల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ పథకాలను గడపగడపకు చేరవేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హేమలత

ఊట్కూర్: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేద్దామని కర్ణాటక ఎమ్మెల్సీ హేమలత అన్నారు. సోమవారం మండలంలోని హనుమాన్ ఆలయం వద్ద అసెంబ్లీ ప్రవాస్‌యోజన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారికి అందేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఎంతోమంది ప్రజలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ కన్వీనర్ కర్నెస్వామి, మండల అధ్యక్షుడు రమేశ్, ఎంపీటీసీ హన్మంతు, నాయకులు ప్రసన్న, బలరాంరెడ్డి, కృష్ణయ్యగౌడ్, లక్ష్మన్, భరత్, రఘువీర్ పాల్గొన్నారు.

గండిని పూడ్చండి..

మరికల్: కోయిల్‌సాగర్ లింక్ కెనాల్‌కుపడ్డ గండిని పూడ్చివేసి పంటలకు నీళ్లు అందేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కమల్, ఆశమ్మ, ఆంజనేయులు, రాజేష్ అన్నారు. సోమవారం గండిపడ్డ కాల్వను రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూటర్ 16నుంచి జిన్నారం, కన్మనూర్ శివారులోని దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు తీసిన కాల్వకు మూడేళ్ల క్రితం గండి పడిందని, తీలేర్ పంపుహౌస్‌నుంచి వచ్చే సాగునీరు వృథాగా పోతుందన్నారు. అధికారులు స్పందించి కాల్వకు పడ్డ గండిని మరమ్మతులు చేస్తే వెయ్యిఎకరాల పత్తిపంటలకు సాగునీరందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పెంటన్న, రవికుమార్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.



లింక్ కెనాల్‌కు పడ్డగండిని చూపిస్తున్న రైతులు

పేదలకు ఆర్థికసాయం

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని ఆనాథవిద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ స్కీం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఓఆర్‌డబ్ల్యూ సుజాత తెలిపారు. సోమవారం ఆమె మండలంలోని ప్రభుత్వపాఠశాలలో ధరణి, నిరీక్షణ అనే ఇద్దరు తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఉన్నట్లు దరఖాస్తు వచ్చిందని వారి పూర్తివివరాలు సేకరించేందుకు నేడు పాఠశాలలో రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం జరిగిందన్నారు. వీరి ఇరువురికి నెలకు రూ. 4వేలు స్కాలర్‌షిప్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నర్సింహులు, శివరాజ్, సీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న సుజాత

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

నారాయణపేట రూరల్: ఉద్యమం ద్వారానే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకుందామని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాహనశ్రేణిని ప్రారంభించి మాట్లాడుతూ.. టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కమిటీలపేరుతో పీఆర్సీ విషయంలో కాలయాపన చేస్తున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 317జీఓలో స్థానికత నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలన్నారు. పండిత్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సింహ, మల్లికార్జున్, గుంపుబాలరాజు, శ్రీనివాస్, కుర్మయ్య, విశ్వనాథ్‌రెడ్డి, రవికుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, రవీందర్, సురేష్, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.



ధర్నాకు తరలివెళ్తున్న తపస్ నాయకులు

కోస్గి: మండలంలోని తపస్ ఉపాధ్యాయసంఘం నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాకు తరలివెళ్లారు. తెలంగాణణ రాష్ట్ర సాధనస్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యంగా తపస్‌పోరాటం చేస్తుందన్నారు. టీపీయూఎస్ మల్లికార్జున్, ఆయా మండలాల అధ్యక్షకార్యదర్శులు తుల్జరాం, అంజిలయ్య, రవీందర్‌నాయక్, అనంతయ్య, శంకరప్ప, శ్రీకాంత్, సత్యకుమార్, నరేందర్, అర్జున్ పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతం చేయాలి

కోస్గి: బీజేపీ కార్యకర్తలు సమిష్టిగాపోరాడి తెలంగాణలో అవినీతిపాలనను అంతం చేయాలని కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా కుందపూర ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కొడుగే పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా సోమవారం ఆయన కోస్గి పట్టణానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచిరాష్ట్రస్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషిచేసి రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్నారు. ప్రజల దృష్టిని బీఆర్ఎస్ వైపు మళ్లించేందుకు పాల్పడుతున్నారని విమర్శలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, పున్నం లహోటి, కన్వీర్ నర్సింహులు, కో కన్వీనర్ రాములు, మండల అధ్యక్షుడు సీబీవెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి బీడీల శ్రీకాంత్, రమేష్, నారాయణ, కిరణ్, యాదయ్య, మంగళి భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కర్ణాటక ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

'ఇవే నాకు చివరి ఎన్నికలు'

నారాయణపేట: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలే తనకు చివరివని.. ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యనే ఉంటూ సేవచేస్తానని.. డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీవీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. అనంతరం సీవీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు, అభిమానులు సీవీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. తనకు ఫక్తు రాజకీయాలు చేయకపోవడంతోనే ఓడిపోయాను తప్ప.. ప్రజల హృదయాల్లో ఎప్పుడో గెలిచానన్నారు. తనతోపాటు వెంకటేశ్వర్‌రెడ్డి వారసులు ఇకనుంచి ఈ ప్రాంత ప్రజల సేవలో నిమగ్నమవుతారన్నారు. చిట్టెం అభిజయ్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయ సాధన కోసం కుంభం శివకుమార్‌రెడ్డి కృషి చేశారన్నారు. డాక్టర్ చిట్టెం ఫర్నీక మాట్లాడుతూ జనం కోసం ఉండాలనేది తమ నాన్న ఆశయమని, వారి ఆశయసాధనకు అనుగుణంగా ఓ వైద్యురాలిగా తనభర్తతో కలిసి ఈ ప్రాంత పేదలకు వైద్యసేవలు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ గౌస్, బాలరెడ్డి, రవీందర్, ఎండీ సలీం, హన్మంతు, వెంకటపతి, శరణప్ప, యూసుఫ్ తాజ్, రమేశ్, అఖిల్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సీవీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శివకుమార్‌రెడ్డి తదితరులు

చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డికి నివాళి..

ధన్వాడ: మండల కేంద్రంలోని కంచుకోటలో చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.